విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

తుపాను, కరువు నష్టాలపై
నేడు రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర -భీమవరం: రైతాంగం నడ్డివిరిచిన మిచౌంగ్ తుపాను, కరువు నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి ఆధ్వర్యంలో 11వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, రైతు,ప్రజా సంఘాలతో కూడిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం భీమవరంలో ఆయన మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగానే రైతన్నలు నిండామునిగారని, తుఫాన్ సాయమందించడంలో కూడా మీన మేషాలు లెక్కిస్తున్నారని వీటన్నింటిపై చర్చించి కార్యాచరణను రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయిస్తామని కోనాల వివరించారు.

12న రాష్ట్ర గవర్నర్ పర్యటన

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర గవర్నర్ ఈ నెల 12వ తేదీ మంగళవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈ నెల 12 వ తేదీన దెందులూరు మండలం గాలాయిగూడెం లో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' లో పాల్గొంటున్న సందర్భంగా ఈ మేరకు ఆయా అధికారులకు గవర్నర్ పర్యటనకు సంబంధించిన విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ పర్యటనకు పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గవర్నర్ పర్యటించే మార్గంలో పారిశుధ్య పరిస్థితులు ఉండేలా ఉండాలని, పరిసరాలలో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు.

గ్రామీణ కష్టజీవుల ధర్నాకు తరలిరండి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణం ప్రతి గ్రామంలో ప్రారంభించి కష్టజీవులను ఆదుకోవాలని, ఈనెల 14న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే గ్రామీణ కష్టజీవుల ధర్నా విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కే లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ పట్టణ కార్యాలయం కపర్ది భవనంలో ధర్నా, కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2005లో కమ్యూనిస్టుల మద్దతుతో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించిందన్నారు. దీని ప్రకారం గ్రామీణ కూలీలకు ఏడాదికి 100 రోజులు పని కల్పించాలన్నారు. వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు తక్షణం ప్రతి గ్రామంలో ప్రారంభించాలన్నారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్ లో 2లక్షల 40 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డులోని ప్రతికూలికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి (ఫీల్డ్ అసిస్టెంట్) ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉలింకల జయకృష్ణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కంకట రత్నకుమార్, సిపిఐ నాయకులు కొనతాల నాగరాజులు పాల్గొన్నారు.

నేడు నూజివీడులో జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం సోమవారం ఉదయం గం.10 నుండి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో జిల్లా కలెక్టరు, జిల్లా జాయింటు కలెక్టరు, జిల్లా స్థాయి అధికారులు అందరూ హాజరై అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మునిసిపల్ కార్యాలయాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుని మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని వేగవరం తూర్పుపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంలో వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భద్రాచలం వెంకటేశ్వర కాలనీకి చెందిన ఉజ్జగిరి క్రాంతికుమార్ వడ్రంగి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. ఆదివారం స్కూటీ పై స్వగ్రామం నుంచి జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. వేగవరం వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం క్రాంతికుమార్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఘటన స్థలంలోనే క్రాంతికుమార్ మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న జంగారెడ్డిగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠకులు సాహిత్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న సాహిత్యాన్ని చదివి ప్రయోజ నం పొందాలని మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర శాఖ గ్రంథాలయానికి ఆయన ఆర్థిక సహాయంతో 200 పైగా పుస్తకాలను అందజేశారు. ఆంగ్ల సాహిత్యం తెలుగు సాహిత్యం పుస్తకాలను కమిటీ సభ్యులకు ఇందుకూరి వెంకట నరసింహారాజు (బవి రాజు), గుడ్ల వెంకట కృష్ణారావు (అడ్వకేట్) కు గ్రంథాలయంలో అందజేశారు. ఈ గ్రంథాలు ఆధ్యాత్మిక, చరిత్ర, సాహిత్యం ,ఈ గ్రంథాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాల పాలకుడు పి రంగారావు, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవం



విశాలాంధ్ర -భీమవరం: అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమ వరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసి యేషన్ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఉండపల్లి రమేష్ నాయుడు, పి.అమూల్యారావులు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలో ఉన్న సర్వ ప్రతినిధి సభ విశ్వజనీయ మానవ హక్కులు ఉల్లంఘన జరుగరాదని ప్రకటించిందని అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో మానవ హక్కులను చేర్చారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పట్టణ అధ్యక్షులు పి. రాజబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం. సీతారామ్ ప్రసాద్, సభ్యులు ఎస్.కె.చాంద్ బాషా, జిల్లా యాదవ సంఘం నాయకులు కోండ్రు శ్రీనివాస్, దళిత ఐక్య నాయకులు సభ్యులు గంటా సుందర్ కుమార్, సంఘ సేవకులు భట్టిప్రోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: 32 మంది విద్యార్థి యువకుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ తీర్మానించింది.ఏలూరు స్ఫూర్తి భవనంలో జరుగుతున్న ఏఐటియుసి ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారం ముగిశాయి. మహాసభ చేసిన తీర్మానాల నిర్ణయాలను ఏఐటియుసి ఏలూరు జిల్లాకు ఎన్నికైన నూతన అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు ఆదివారం నాడు పత్రికలకు విడుదల చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటుపరం చేయవద్దని మహాసభ డిమాండ్ చేసింది. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన సంఘం బోర్డును నియమించి కనీస వేతన జీవోను విడుదల చేయాలని, స్కీం వర్కర్లైన అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంబంధించి కార్మిక శాఖలో అపరిష్కృతంగా ఉన్న క్లైమ్లను క్లియర్ చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో గ్రీన్ అంబాసిడర్ గా పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం నెలకు రూ.10వేల వేతనం చెల్లించాలని మహాసభ తీర్మానించింది. స్కూల్ ఆయాలకు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు ఇస్తున్న వేతనాల్ని పెంచాలని, ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి పురపాలక సంఘాలలో నగరపాలక పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్సును, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి ఇవ్వాలని మహాసభ తీర్మానం చేసిందని వారు తెలిపారు.ఈపీఎఫ్ 95 పెన్షన్ స్కీమ్ పెన్షన్లను పెంచాలని ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా మహాసభ మద్దతు తెలుపుతూ తీర్మానం చేసినట్లు తెలిపారు.

ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఏలూరు జిల్లా ఏఐటియుసి 29 మంది సభ్యులతో కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు ఎన్నికయ్యారు.గౌరవ అధ్యక్షులుగా కే కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు జి అంజమ్మ, బి రాంబాబు, భజంత్రీ శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శులుగా చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, కోశాధికారిగా పుప్పాల కన్న బాబు, సహాయ కార్యదర్శులుగా ఎ. అప్పలరాజు, ఎ. రాజు, కే సైదా, కే విఘ్నేష్, మహాసభ ఎన్నుకుందని శ్రీనివాస్ డాంగే బుచ్చిబాబు తెలిపారు.

శ్రీనివాస్ డాంగే

బుచ్చిబాబు

గ్రామీణులకు అందని శుద్ధి జలం

- నీటి పరీక్షలు నిల్
- నిరుపయోగంగా నీటి పరీక్ష కిట్లు
- పట్టించుకోని ఇంజనీరింగ్ సహాయకులు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : గ్రామీణ ప్రజల రక్షిత మంచినీరు ఎండమావిగా మారింది. నీటి పరీక్షలు నిర్వహించి రక్షిత తాగునీరు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని నేతలు తరచూ చెబుతున్నా క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల భిన్న పరిస్థితులున్నాయి. గ్రామాల్లో మంచినీటి నమూనాలకు పరీక్షలు జరగడం లేదు. లక్షలు వెచ్చించి ప్రభుత్వం నీటి పరీక్షలకు ఇచ్చే సామగ్రి మూలన పడుతోంది. పట్టించుకోవాల్సిన వారుమిన్న కుండిపోతున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు కరువవుతోంది. దీంతో అనేక ప్రాంతాల్లో అపరి శుభ్రమైన నీరు తాగిప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని ఇంజనీరింగ్ సహాయకులు

గ్రామీణ నీటి సరఫరా విభాగము (ఆర్‌డబ్ల్యూఎస్) మంచినీటి పరీక్షలకు తిలోదకాలు ఇచ్చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం మంచినీటి వనరుల ద్వారా ఇంటింటికి తాగునీటి వసతులు కల్పించడం, వాటి ద్వారా సురక్షిత నీటిని అందించటం ఆర్ డబ్ల్యు ఎస్ అధికారుల బాధ్యత. వినియోగంలో ఉన్న మంచినీరు శుభ్రంగా ఉందా...? లోపాలు ఏమైనా ఉన్నాయా...? తెలుసుకోవాలంటే నీటి పరీక్షలు అవసరం. గతంలో కార్యదర్శులకు ఈ పరీక్షల కిట్లు ఇచ్చిన సగం మంది పక్కన పడేశారు. సాధారణంగా మారిన పరిస్థితులలో తాగునీరు కలుషితమైతే అంటూ వ్యాధులు సోకుతాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీటి పరీక్షలు నిర్వహించే కిట్లు అందుబాటులో లేకపోవడంతో మంచినీటి పరీక్షలు నిర్వహించేవారు కాదు. గ్రామాలలో త్వరగా నీటి పరీక్షలు నిర్వహించాలని ఆలోచనతోనే ప్రభుత్వం మల్టీ పెరామీటరు, వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్ట్, కిట్లకు గాను గ్రామపంచాయతీలకు అందజేసింది. నీటి పరీక్షల బాధ్యతను సచివాలయాలలోని ఇంజనీరింగ్ సహాయకులకు అప్పగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్ డివిజన్ల పరిధిలో మంచినీటి పరీక్షల ల్యాబ్ లు ఉన్నాయి. ఈ ల్యాబ్ లలో ప్రతిరోజు నీటి పరీక్షలు నిర్వహించాలి. ముందుగా సబ్ డివిజన్ ల పరిధిలో గ్రామ గ్రామాన ప్రతిరోజు నీటి పరీక్షలు నిర్వహించాలి. సబ్ డివిజన్ పరిధిలోని ల్యాబ్ లో ఒక కెమిస్ట్, మైక్రోబయాలజిస్టు, సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉంటారు. ప్రతిరోజు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామాలకు వెళ్లి మంచినీటి నమూనాలు సేకరించి ల్యాబ్ లకు తీసుకుని రావాలి. ల్యాబ్ లలో క్లోరిన్ పరీక్ష నిర్వహించాలి. నెలకు ఒకసారి మంచినీటి నాణ్యత ప్రధాన పరీక్ష నిర్వహించాలి. ఈ పరీక్షలో మొత్తం 13 రకాల అంతర్గత పరీక్షలు ఉంటాయి. ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకును శుభ్రం చేయించాలి. ఇది పంచాయతీ సహకారంతో చేయాల్సిన పని. వీటికి సంబంధించి గ్రామీణ నీటి సరఫరా విభాగం రికార్డులను నిర్వహించాల్సి ఉంటుంది. రికార్డులలో మాత్రం ట్యాంకులు కడగకపోయినా కడిగినట్లుగా చూపుతారు. పరీక్షలు జరిగినట్లుగా మంచినీరు సరఫరా చేసే సమయంలో పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. నీటి నాణ్యత పై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం కట్టింది. క్షేత్రస్థాయిలో అక్కడి కక్కడే మంచినీటి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని పంచాయతీలకు ఎఫ్ఏకె కిట్లను పంపిణీ చేసింది. మండలాలలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈలు సచివాలయాలలోని ఇంజనీరింగ్ సహాయకులకు నీటి నమూనాల సేకరణ, పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి పంచాయతీకి ఒక్కొక్క కిట్ తో పాటు పరీక్షలకు అవసరమైన రసాయనాలను అందజేశారు. శుద్ధి జలం కోసం ఫిల్టర్ బెడ్ ను ప్రభుత్వం అందజేసింది. అది కూడా వినియోగించడం లేదు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ సహాయకులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు.

నీటి పరీక్షలు నిల్

పంచాయతీకి వాటర్ టెస్టింగ్ కిట్లు సరఫరా చేశారు. ఒక్కొక్క కిట్టు రూ.1300 వ్యయంతో కొనుగోలు చేసి అందజేశారు. ఈ కిట్ ల ద్వారా ప్రతిరోజు నీటిలో క్లోరైడ్, ఫ్లోరైడ్, ఐరన్ తదితర సాంద్రత ఎంత మేర ఉందో తెలుసుకోవాలి. ఆ నీటిలో లవణాల లభ్యత, సల్ఫర్, కాలుష్యం శాతం ఎంత మేర ఉందో పరీక్షలలో తెలుసుకోవాలి. దీనిని బట్టి ఆ మంచి నీటిలో స్వచ్ఛత, నాణ్యత తెలుసుకుని ప్రజలకు సరఫరా చేసే వారి ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. కానీ ఈ పరీక్షలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. కనీసం క్షేత్రస్థాయిలో కిట్లు ఉన్నా నీటి పరీక్షలు చేయక యంత్రాలు మూలన పడేశారు. దీంతో లక్షల విలువ చేసే పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలలో క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించి శుద్ధి జలం సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెన్నేటికి కళా పురస్కారం

విశాలాంధ్ర -భీమవరం: విజయవాడకు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మాస్టారు తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తికి "తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం" సత్కరించింది. ఆదివారం విజయవాడ బాలోత్సవ్ భవన్ లో నిర్వహించిన జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం-2023లో ఆయన పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమారాచార్యులు, జాతీయ కన్వీనర్లు డాక్టర్ రంగిశెట్టి రమేష్, బ్రహ్మశ్రీ డాక్టర్ వలబోజు మోహన్ రావు, పెద్దింటి యోహాను తదితరులు పాల్గొన్నారు. రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్వీయస్ రాజు , పశ్చిమ గోదావరి శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షులు డాక్టర్ యండపల్లి పాండురంగాచార్యులు, గోదావరి సాహితీ ప్రభ సభ్యులు రమా ప్రతిభ, సాహితీ మిత్రులు, తెన్నేటిని అభినందించారు.

ఎన్యూమరేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి

విశాలాంధ్ర- ఏలూరు : ఎన్యూమరేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, సకాలంలో పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్ కు ఆదివారం ఆన్లైన్ ద్వారా వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. తుఫాను వల్ల పంటల వారీగా, రైతుల వారీగా నష్టం అంచనాలు తయారుచేసే ఎన్యూమరేషన్ ప్రక్రియ ఇంత వరకూ ప్రారంభం కాకపోవడం వల్ల రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోందన్నారు. రైతులను ఆదుకుంటామని ఒక ప్రక్క ప్రకటనలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రక్క ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. పడిపోయిన వరి చేలల్లో నీరు బయటకుపోయాక, తడిచిపోయిన ధాన్యాన్ని, వరి పనలను అరబెట్టుకున్నాక అధికారులు వచ్చినా ఫలితం ఉండదని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు.

అమ్మా - నాన్న సహాయక సేవ సంస్థ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కైకలూరు : వృద్ధులైన పెద్ద వారి అందరికి ఈ రోజున మా అమ్మా-నాన్న సహా యక సేవా సంస్థ సేవలు అందించటం తన అదృష్టంగా భావిస్తున్నానని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరు విజ్ఞాన్ కాలేజీలో కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వర రావు అమ్మా-నాన్న సహా యక సేవా సంస్థ ద్వారా వారి కుటుంబ సభ్యులు, ముఖ్య అతిథి, రాజ్య సభ సభ్యులు బీద మస్తాన్ రావు తో కలసి వృద్ధులైన తాత అవ్వలకు సుమారు 2 వేల మందికి పంచెలు, చీరలను అందించారు. ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ 15 సంవత్సరములుగా అమ్మా-నాన్న సహాయక సేవా సంస్థ ద్వారా సేవలు అందిస్తున్న డిఎస్ఆర్‌కు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం వృద్ధులైన పెద్దలు తాత అవ్వ లకు పంచెలు, చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీ రామ దుర్గాప్రసాద్, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, సర్పంచ్ యడాలి నాగేశ్వరరావు, పిఏసియస్ అధ్యక్షులు వడుపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1056 కేసుల పరిష్కారం

విశాలాంధ్ర -భీమవరం: భీమవరంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1056 కేసులు పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీ సత్యాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు పంతానికి పోకుండా రాజీ చేసుకోవడం ద్వారా సమయం వృధా కాదన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు సహకరిస్తేనే త్వరిత గతిన న్యాయం జరుగుతుందన్నారు. ప్యానల్ లాయర్స్ పారా లీగల్ వాలంటీర్లు, మీడియా సహకరించడం వల్లనే ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు ఆమె తెలిపారు. లోక్ అదాలత్‌లో భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ళ, ఆకివీడు పోలీస్ స్టేషన్ లకు సంభందించి 16 సివిల్, 95 క్రిమినల్ కేసులు, 138 ఎక్సైజ్ కేసులు, 5 మనోవర్తి కేసులు, 47 చెక్ బౌన్స్ కేసులు, 5 బ్యాంక్ రికవరీ కేసులు, 734 ఎస్టీసి కేసులు, 15 బిఎస్ఎన్ఎల్ కేసుల్లో అవార్డు ప్రకటించినట్లు ఆమె తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పల స్వామి, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు, 2వ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ధనరాజు లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులుగా జి.ఉమా రాణి, టీ.వి.బి. లక్ష్మి, ఎన్.రత్నాకర్‌రావు, ఎం. దుర్గా ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకట రమణ రావు, కార్యదర్శి పి.రమేష్ బాబు, పోలీస్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్రాంచి అధికారులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు



విశాలాంధ్ర-భీమవరం టౌన్: జిల్లాలోని నాలుగు డిపోల నుంచి భక్తుల సౌకర్యార్థం పంచరామ దర్శని, ఏకాదశరుద్రుల యాత్ర, శివ కేశవ దర్శిని, అరుణాచలం, మన్య సీమ దర్శని వంటి యాత్రలను అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందని జిల్లా ప్రజా రవాణా అధికారి అడ్డగడ వీరయ్య చౌదరి తెలిపారు. వీటితోపాటుగా శబరిమలై వెళ్ళు స్వాములకు కూడా బస్సు సౌకర్యం కల్పిస్తునట్లు తెలిపారు. అరుణాచలం, పంచరామ క్షేత్ర దర్శిని యాత్రలకు భక్తుల నుంచి విశేష స్పందన రావడం చాలా సంతోషమన్నారు. పంచారామ యాత్రికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.అనుభవజ్ఞులైన డ్రైవర్లు, వీడియో కోచ్ హైటెక్ బస్సులు, అల్ట్రా డీలక్స్, ఎక్స్ప్రెస్, పల్లె వెలుగు బస్సులను ఈ యాత్రలకు ప్రయాణికుల కోరిక మేరకు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇవి కాకుండా.విద్యార్థులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు వారు కోరిన రోజు, కోరిన ప్రదేశం నుండి శ్రీశైలం, భద్రాచలం, అన్నవరం, తదితర పుణ్యక్షేత్రములకు, పేరుపాలెం బీచ్, ఉప్పాడ బీచ్ మొదలగు విహారయాత్ర ప్రదేశాలకు ప్రత్యేకముగా బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి అడ్డగడ వీరయ్య చౌదరి కోరారు.

గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బయ్యనగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో సిసి రహదారులు, డ్రైనేజీలు, పలు వసతులు సమకూర్చాలని తెదేపా మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బయ్యనగూడెం గ్రామంలో జగనన్న కాలనీలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పలు సమస్యలు ఉండడంతో సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సాయి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గొర్రెపాటి మహేష్, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు టేక్కెం. సీతారాం, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వచ్చినా భయపడవద్దు

విశాలాంధ్ర - గణపవరం: క్యాన్సర్‌కు భారతదేశంలో అత్యున్నత స్థాయి చికిత్స అందుబాటులోకి వచ్చిందని భారతదేశంలో మొట్టమొదటిసారిగా భీమవరం ఒమేగా హాస్పిటల్ లో ప్రజలకు అందుబాటులో వచ్చిందని ఒమేగా భీమవరం హాస్పటల్ డాక్టర్ నల్లం శ్రీకాంత్ అన్నారు. ఆదివారం గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు, కార్తీక వన సమారాధన కార్యక్రమం పురస్కరించుకుని క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గణపవరం నిడమర్రు మండలాల ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. పిఎంపి గణపవరం మండల అధ్యక్షులు మందా సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఒమేగా భీమవరం హాస్పిటల్స్ వారు సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పీఎంపి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి పి టి రాజు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కే పరమేశ్వర్లు, కార్యదర్శి సుభాన్, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆనందం సుబ్బారావు, కార్యదర్శి ఎం. జయరాం, రాష్ట్ర ముఖ్య సలహాదారులు నిడమర్తి జయ సూర్య, వి. శివ శ్రీనివాసరావు, సిహెచ్ నరసింహారావు, రెండు మండలాల పిఎంపి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కార్తీక వన సమారాధన జరిగింది.

ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే ప్రతి విద్యార్థి లక్ష్యమని, వారి ఆశయాలకు అనుగుణంగా తల్లి దండ్రులు ప్రోత్సహించాలని, విదేశాల్లో విద్యను అభ్యసించే వారి కోసం ఇటు వంటి ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం జెపి రోడ్డులో ఎడ్ మిమ్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, ఇందులో భాగంగానే ప్రతిభ కలిగిన విద్యార్థులకు విదేశీ విద్యను కూడా అందిస్తున్న విషయాన్ని ప్రతి విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. ఇష్టపడి చదివితే విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించుకోవడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. విదేశీ విద్య కోసం విద్యార్థులు ఏ విధంగా ప్రిపేర్ కావాలి, ఇంటర్వ్యూలలో ఏ విధంగా విజయం సాధించాలి అనే దానిపై ఈ సెంటర్ పూర్తి స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ సెంటర్ లో విదేశీ విద్యకు సంబంధించి 28 కోర్సులు ఉన్నాయని ఆయన వివరించారు. భీమవరంలో దేశంలోనే టాప్ టెన్ ఇంజనీరింగ్ కాలేజీలు ఎస్ ఆర్ కె ఆర్, విష్ణు ఇంజనీరింగ్ సంస్థలు ఉన్నాయన్నారు. బ్రాంచ్ మేనేజర్ మంజూష అభిలాష మాట్లాడుతూ విదేశాల్లో విద్య, ఉన్నత ఉద్యోగం ఇవే మొదటి ప్రాధాన్యత అని, యుఎస్ఎ, యుకే, ఆస్ట్రేలియా, కెనడా, ఐర్లాండ్, జర్మనీ, సింగపూర్, దుబాయ్ తదితర దేశాల్లో విస్సా దరఖాస్తు ప్రక్రియ, చదువుకునే సమయంలో అక్కడ అవకాశాలను పూర్తిగా తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు, వైసిపి రాష్ట్ర యువత నాయకులు గ్రంధి రవితేజ, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహారాజు, ఎస్ ఆర్ కె ఆర్ కాలేజీ సిఎస్ సి హెచ్ ఓ డి డాక్టర్ చంద్రశేఖర్ వాసం శెట్టి, మావుళ్ళమ్మ దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, గొట్టుముక్కల పద్మరాజు, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కాపులంతా ఐక్యంగా ఉండాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కాపులంతా ఐక్యతతో ఉండాలని డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో ఆదివారం కాపు సంఘ నాయకుల ఆధ్వర్యంలో కాపు వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కరాటం రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తారతమ్యాలు లేకుండా ఐక్యతతో కలిసిమెలిసి ఉండాలని అన్నిటి కంటే స్నేహం గొప్పది అని ఆయన తెలిపారు.చిన్నారులు ఆటపాటలతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో జెట్టి.గుర్నాథరావు,తాడికొండ మురళీకృష్ణ, పారేపల్లి రామారావు, దుగ్గిన శ్రీను, జుంగ బాబ్జి,గంగిరెడ్ల సతీష్, మేడిన కన్నయ్య, ఏపూరి సతీష్, నక్క బాబి, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయాలు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర - నిడమర్రు: గ్రామీణ ప్రాంతాల్లో పురాతన దేవాలయాలు అభివృద్ధి చేయడానికి దాతల సహకారం ఎంతైనా అవసరం ఉందని ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం నిడమర్రు మండలం అడవికొలను గ్రామపంచాయతీ పరిధిలో గల నాగనమిల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి ఆలయ పునః నిర్మాణం,విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని, స్వామిని దర్శించుకున్న ధర్మరాజు ఈ వేడుకలో గ్రామ పెద్దలు, జనసేన నాయకులు, జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఓ ఎ.అద్దయ్య తెలిపారు. మర్రి గూడెం గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు, స్థానికులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో మానవ హారం నిర్వహించి బాలికలతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన వారం దరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి అన్నారు. ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మి వెంకటేశ్వర రావు, తహసిల్దార్ జెవి సుబ్బారావు,సర్పంచ్ సోయం బిందు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర - ఏలూరు : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సిఐ డి. శివరామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తమకు అందిన సమాచారం మేరకు గుండుగొలను జంక్షన్ జాతీయ రహదారి పై తనిఖీలు నిర్వహిస్తుండగా ఎపి39యు ఎస్ 3982 నెంబరు గల మహేంద్ర బోలేరో వాహనంఆపి తనిఖీ చేయగా 45 క్వింటాళ్ళ రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వ్యాను డ్రైవర్ విజయవాడకు చెందిన ఏనుగు ప్రవీణ్ ను విచారించగా విజయవాడ సింగ్ నగర్ కు చెందిన సుబ్రహ్మణ్యం సింగ్ నగర్ పరిసర ప్రాంతాలలో కిలో రు.12లకు కొనుగోలు చేసి కాకినాడకు చెందిన చోడిశెట్టి కాశికి కిలో రు.16లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో రూ.1 లక్ష80వేలు విలువ కలిగిన బియ్యం, రూ. 9 లక్షల33వేల 850ల విలువ గల వాహనము వెరసి మొత్తం విలువ రూ.11 లక్షల13వేల 850లు విలువ కలిగిన సొత్తును సీజ్ చేసి ఏనుగు ప్రవీణ్, సుబ్రహ్మణ్యం, చోడిశెట్టి కాశి, వాహన యజమాని నారపోగు రమేష్ లపై నిత్యావసరవస్తువుల చట్టం 1955 ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో రెవిన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

టీడీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: టిడిపి అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. ఆదివారం రాజమండ్రి రూరల్ బొమ్మూరు గ్రామంలో టిడిపి ఓటర్ వెరిఫికేషన్, బాండ్స్ పంపిణీ కార్యక్రమం, సమీక్షలో మాజీ ఎమ్మెల్సీ అంగర పాల్గొన్నారు. స్వయంగా ప్రజలలో తిరిగి పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ ప్రెసిడెంట్ మచ్చేటి ప్రసాద్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తేమశాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-ఆచంట: తేమ శాతంతో నిమిత్తం లేకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆచంట, వేమవరం, భరోసా కేంద్రం వద్ద రైతులు ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్టుగా తేమతో సంబంధం లేకుండా రైతు భరోసా కేంద్రం ఆమోదించిన తేమ శాతానికి కట్టుబడి రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులను మిల్లు యజమానులు ఇబ్బంది పెట్టకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. మిచౌంగ్ తుఫాను రైతులను నిండా ముంచిందని, పంట చేలల్లో ఉండగానే ముంపుకు గురైందని నష్టం బాగా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న ,సన్న కారు, కౌలురైతులకు దాళ్వా సాగుకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని, సబ్సిడీపై ఎరువులు పురుగు మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో మెలగడం ఉత్తమ సాంప్రదాయం

విశాలాంధ్ర - పాలకొల్లు: సమాజంలో ఒక సామాజిక వర్గీయులు ఐక్యతను చాటుకునేలా ఒక చోట కుటుంబ సభ్యులతో కార్తీక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమ సాంప్రదాయమని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు లజపతిరాయ్ పేట క్షత్రియ కళ్యాణమండపంలో క్షత్రియుల ఆధ్వర్యంలో, స్థానిక ఏఎంసి మార్కెట్ యార్డులో శ్రీకృష్ణ యాదవ సంఘ ఆధ్వర్యంలో, పెద్ద సాయిబాబా గుడి రోడ్ లో అడబాల గార్డెన్స్ లో శ్రీకృష్ణదేవరాయ సంఘ ఆధ్వర్యంలో, శిడగం సత్యనారాయణ లేబిట్ లో తెలుకుల సంఘ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అందర్నీ ఆప్యాయతతో పలకరించారు. సంబంధిత కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆలోచనా రహిత స్థితి పొందవచ్చు

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రభోదించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం ప్రతిరోజూ చేయడం ద్వారా ఆలోచనా రహిత స్థితిని పొందడం జరుగుతుందని రావులపాలెంకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీమతి వి.ధరణి అన్నారు. స్థానిక శ్రీ సీతారామస్వామి వారి దేవస్థాన ప్రాంగణం లో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సోసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానశిక్షణ ద్వారా నాడీమండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యం పొందుతామని, ప్రతిఒక్కరూ ధ్యానంతో పాటు మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలన్నారు. ధ్యానం సర్వరోగ నివారణి,సర్వ భోగకారిణి, సత్య జ్ఞాన ప్రసాదినని, పిరమిడ్ జ్ఞానరత్నాలు, సంకల్పశక్తి గూర్చి చక్కగా వివరించారు. ప్రతిఒక్కరూ ధ్యానసాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, ఎం.కృష్ణారావు, సన్నిధి ఉదయ్, వర్రివిశ్వేశ్వరరావు, కృష్ణవేణి, సబ్బారపు కమల, భ్రమరాంబ, బోళం యర్రాయమ్మ, జామి పైడమ్మ, బుడబళ్ళ శ్రీదేవి, తదితరులు పాల్గొని సామూహిక ధ్యానం చేసారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రెండవ అంతర్జాతీయ తెలుగు మహా సభలను విజయవంతం చేయాలని అంతర్జాతీయ తెలుగు మహాసభ పోలవరం నియోజకవర్గం కన్వీనర్ రొక్కాల నాగరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం కొయ్యలగూడెం పట్టణంలో జరిగిన కాపు వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కరాటం రాంబాబు, జెట్టి గురునాధరావు ల చేతుల మీదుగా "ఆంధ్రమేవ జయతే" తెలుగు మహాసభల గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వచ్చే జనవరి 5,6,7,తారీకులలో రాజమహేంద్రవరంలో గోదావరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు హాజరయ్యి విజయవంతం చేయాలని ఆయన కోరారు. గోడపత్రికలు ఆవిష్కరించిన వారిలో తాడికొండ మురళీకృష్ణ, దుగ్గిన శ్రీను, పారేపల్లి రామారావు, పైడిముక్కల కృష్ణ, జుంగ బాబ్జి,తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయతకు వనభోజనాలు నిదర్శనం

విశాలాంధ్ర- పెనుగొండ: ఆత్మీయతకు వనభోజనాలు నిదర్శనంగా నిలుస్తాయని ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు, పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం పెనుగొండలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కునపరెడ్డి నానాజీ నిర్వహించిన తాండ్ర పాపారాయుడు వనసమారాధన కార్యక్రమంలో శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజుమాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక వన సమారాధన పేరుతో సమావేశం అవడం వలన మానసిక ఉల్లాసం, ఆనందం కలుగుతాయి అన్నారు. అభిమానం ఆప్యాయతలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా-ప్రధానమంత్రి పసల బీమా యోజన

- ఇకపై నోటిఫై చేసిన పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా ఒకే రీతిలో బీమా రక్షణ
- ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే వర్తింపు
- పంటలవారీగా నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర-ఏలూరు: డా.వైఎస్ఆర్ ఉచిత పంటల భీమాను కేంద్రప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి పసల భీమా యోజనతో సంయుక్తంగా అమలు చేసే పథకానికి సంబంధించి 2023-24 ఖరీఫ్ రబీ సీజన్ లో ఈ పథకాన్ని అమలు చేసే భీమా కంపెనీలు, భీమా వర్తించే పంటల వివరాలను ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భీమా పథకం ద్వారా నోటిఫై చేసిన పంటలను సాగుచేసి ఇ-క్రాప్ నమోదు, ఇ-కేవైసి పూర్తిచేసిన రైతులందరికి ఎటువంటి అదనపు శ్రమ, ప్రత్యేక నమోదు అవసరం లేకుండా కేవలం ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ ఆధారంగా ఉచితంగా పంటల బీమా రక్షణ కల్పిస్తుంది. నోట్ ఫై చేసిన పంటలు పండిస్తున్న రైతులందరూ వారి పంటల వివరాలను ఇ-క్రాప్, రైతు ఇ-కేవైసి, సోషల్ ఆడిట్ విజయవంతంగా పూర్తయిన తర్వాత ఈ కవరేజికి అర్హులు. రైతులు ప్రీమియం రుసుము ఏమి చెల్లించనవసరం లేదు. దిగుబడి ఆధారిత పథకం కింద ఏలూరు జిల్లాలో ఓరియంటల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తున్న భీమా కంపెనీగా వ్యవహరిస్తుంది. వాతావరణ ఆధారిత పథకం యూనివర్సల్ సోంపో జిఐసి లిమిటెడ్ అమలు చేసే భీమా కంపెనీగా వ్యవహరిస్తుంది. ఏలూరు జిల్లాలో 2023 ఖరీఫ్ కాలానికి దిగుబడి ఆధారిత కింద వరి పంటను గ్రామం యూనిట్ గా, మినుములను జిల్లా యూనిట్ గా వాతావరణ ఆధారిత కింద పత్తి పంటను మండల యూనిట్ గా తీసుకోవడం జరుగుతుంది. 2023-24 రబీ కాలానికి దిగుబడి ఆధారితంగా వరి పంటను గ్రామం యూనిట్ గా, మొక్కజొన్నను మండల యూనిట్‌గా, పెసలు పంటను మండల యూనిట్‌గా, మినుము పంటను మండల యూనిట్‌గా తీసుకోవడం జరుగుతుంది. సిజనల్ క్రాప్స్ లో 2023-24 రబీ కాలానికి వేరుశెనగ, నిమ్మ పంటలను మండల యూనిట్ గా తీసుకోవడం జరుగుతుంది. కొన్ని జిల్లాల్లో పెరిగిన సాగు విస్తీర్ణాన్నిబట్టి కొత్త పంటలను బీమా పరిధిలోకి తెచ్చారు. ఈ మేరకు మార్గదర్శకాల్లో మార్పులు చేయడమే కాకుండా, ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచే అమల్లోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సాధారణంగా ఇరిగేటెడ్, నాన్ ఇరిగేటెడ్ కేటగిరీల్లో పంటలు సాగవుతుంటాయి. పూర్వం నుంచి ఇరిగేటెడ్ (నీటి వసతి కల్గిన) విభాగంలో సాగయ్యే పంటలను దిగుబడి ఆధారితంగా, నాన్ ఇరిగేటెడ్ (వర్షాధారం) కేటగిరిలో సాగయ్యే పంటలను వాతావరణ ఆధారితంగా పరిగణనలోకి తీసుకొని బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. నోటిఫై చేసిన జిల్లాల్లో ఖరీఫ్‌లో మిరప, పసుపు జొన్న పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా పూర్తిగా దిగుబడి ఆధారంగానే పరిగుణిస్తారు. పత్తి, వేరుశనగ పంటలను పూర్తిగా వాతావరణ ఆధారితంగా పరిగణిస్తారు. నోటిఫైడ్ జిల్లాల్లో నిమ్మ పంటలను వాతావరణ ఆధారిత బీమా పరిధిలోకి తీసుకొచ్చారు. నాటిన నాలుగో ఏడాది నుంచి నిమ్మ తోటలకు రబీలోనూ బీమా రక్షణ కల్పిస్తారు.

2023-24 సీజన్ కోసం నోటిఫికేషన్ జారీ

వాతావరణ ఆధారిత పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా బీమా రక్షణ కల్పిస్తోంది. 2023-24 సీజన్ కోసం దేశంలోనే అత్యల్ప ప్రీమియంతో బీమా కవరేజ్‌కు ముందుకొచ్చిన కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. జిల్లాలవారీగా కవరేజ్ కల్పించే కంపెనీలతో పాటు నోటిఫైడ్ పంటల వివరాలతో ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. ఖరీఫ్ 2023లో 15 పంటలకు దిగుబడి ఆధారంగా, 6 పంటలకు వాతావారణ ఆధారంగా, రబీ 2023--24లో 13 పంటలకు దిగుబడి ఆధారంగా, 4 పంటలకు వాతావరణ ఆధారంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుబడి ఆధారిత పంటలకు ఖరీఫ్‌లో గ్రామం, మండల, జిల్లా యూనిట్‌గా బీమా కవరేజ్ కల్పిస్తుండగా, వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం మండలం యూనిట్‌గా బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. పంటల బీమా లెక్కింపు, పరిహారం చెల్లింపుల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు పంటల బీమా మార్గుదర్శకాల్లో కీలకమైన మార్పులు తీసుకొచ్చింది. నీటి వసతి, వర్షాధారం ప్రాతిపదికన కాకుండా ఇక నుంచి పూర్తిగా వాతావరణ, దిగుబడి ఆధారంగానే పంటలకు బీమా రక్షణ ఉంటుంది. నోటిఫై చేసిన జిల్లాల్లో నోటిఫై చేసిన పంటలు నష్టపోయే రైతులకు ఒకే రీతిలో పరిహారం దక్కుతుంది. లెక్కింపులో, చెల్లింపుల్లో ఎలాంటి అసమానతలు ఉండవు.

ఆనందోత్సాహాలతో ఆదిత్య సిబ్బంది వన సమారాధన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన సూరంపాలెం అడ్మిన్ సిబ్బంది కుటుంబ సభ్యులు సీతపల్లి వాటర్ ఫాల్స్ ఉద్యాన వనాల వద్ద సరదా సరదాగా గడిపారు. చిన్నారులు పెద్దలు అనే తారతమ్యం లేకుండా ఆట పాటలతో ఎంతో ఉత్సాహంగా సందడి చేశారు. డాన్స్, సాంగ్స్, మిమిక్రీ, మ్యూజికల్ చైర్స్, లెమన్ మరియు స్పూన్ వంటి పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆదిత్య యాజమాన్యం వారు రవాణా,భోజన వసతులు కల్పించారని,వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి గార్కి,డైరెక్టర్ డా.ఎం. శ్రీనివాస రెడ్డి గార్కి ఆదిత్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కార్తీకమాస వన మహోత్సవం

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండల రజక సంఘాల ఆధ్వర్యంలో రజక సంఘం భవనం వద్ద కార్తీక మాస వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయినాపు రపు వెంకట్రావు మాట్లా డుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రజకులందరూ ఐక్యమత్సంగా ఉండి రజక సంఘాలు బలోపేతానికి రజకులందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మమ్మిడివరపు వెంకన్న బాబు, గొల్లపల్లి ధర్మారావు, ముమ్మిడివరపు రాంబాబు, కమిడినాగేశ్వరరావు, ముమ్మిడివరపు లక్ష్మణరావు, వేములవలస అప్పారావు, రజక సంఘం పెద్దలు, రజక సోదర, సోదరీమణులు, యువత తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి కమిటీ మహిళలను సత్కరించిన లోకేష్

విశాలాంధ్ర - జగ్గంపేట : మహాశక్తి కమిటీ మహిళలను యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఆదివారం సత్కరించారు. జగ్గంపేట నియోజకవర్గంలో 90 రోజులు మహాశక్తి మహిళా కమిటీ మహిళలు బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేసినందుకు వారికి టిడిపి నేత జ్యోతుల నెహ్రూ అధ్వర్యంలో లంచ్ బ్రేక్‌లో అభినందన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లోకేష్‌తో పాటు మాజీ మంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప ఉన్నారు.

మూత్ర విసర్జన చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర- కొవ్వూరు రూరల్ : గుంటూరు జిల్లా పొన్నూరులో ఐలాండ్ సెంటర్ లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పై మూత్రవిసర్జన చేసి అవమానకరంగా ప్రవర్తించిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దుష్ట చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుతీసుకునేలా ప్రత్యేకచట్టం తీసుకురావాలని బహుజన సమాజ్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ అధ్యక్షులు గూడా సూర్య సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ఇలాంటి దారుణఘటనలు పైగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహలను అవమానించటం. కూల్చటం ఇప్పుడు విగ్రహంపైనే మూత్ర విసర్జన చెయ్యటం భారత జాతి సిగ్గుపడాలని వీటికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించి సాంఘిక బహిష్కరణ చెయ్యాలని డిమాండ్ చేశారు.

రామచంద్రయ్య యాదవ్‌ను అడ్డుకోవడం హేయమైన చర్య

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు బిసివై కార్యాలయంలో బీసీవై పార్టీ నియోజకవర్గ నాయకులు గొంప శివకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బీసీవై పార్టీ యువత మీడియా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ నాయకులు నైదాన రఘు మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ కారణంగా రాష్ట్రంలో తీవ్ర పంట నష్టంతో బాధపడుతున్న రైతులను పరామర్శించడానికి షెడ్యూల్ వేసుకున్న భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ పర్యటన అడ్డుకోవడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న బోడె రామచంద్రయ్య యాదవ్‌కు రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాల వారు మద్దతు నిలవాలని కోరారు. బీసీవై పార్టీ నాయకులు మురుకుర్తి నాగ వినోద్ యాదవ్, కుండల శ్రీను, సానబోయిన ఆదిబాబు, నాగళ్ల గణపతి, గదుల నాని, నాగళ్ల దుర్గ, లొండా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో మెగా దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం రామచంద్రపురం గ్రామంలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్, రాజానగరం జిఎస్ఎల్ డెంటల్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా నిర్వహించిన ఈ దంత వైద్య శిబిరాన్ని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజా నాయకుడు, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తుమ్మలపల్లి రమేష్ హాజరై ప్రారంభించారు. ఈ యొక్క మెగా దంత వైద్య శిబిరంలో చుట్టుపక్కల పలు గ్రామాలనుంచి పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరై దంత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారందరికీ ఉచితంగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. దంతాల సంరక్షణ పట్ల పలు సూచనలు,సలహాలతో పాటు మందులను ఉచితంగా అందజేశారు. సుమారు 200 మందికి దంతాలకు సంబంధించి మెరుగైన చికిత్స అందించేందుకు రాజానగరం జిఎస్ఎల్‌కు ప్రత్యేక బస్సులో తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో రామచంద్రాపురం గ్రామంలో దంత వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులకు, ప్రత్యేకించి జిఎస్ఎల్ హాస్పిటల్స్ చైర్మన్ గన్ని కృష్ణకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరవడంతో విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శేఖర్, తామరాడ సర్పంచ్ తోట అయ్యన్న, ఎంపీటీసీలు గోకడ రాజా, బందారు ప్రసాద్, పలికెల గంగరాజు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

యానంలో వైభవంగా హర హర మహా యజ్ఞం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కేంద్ర పాలిత ప్రాంతం యానంలో స్థానిక శాసనసభ్యులు గొల్లపల్లి శ్రీనివాస అశోక్ లక్ష్మీ స్నేహ దంపతులు చేతుల మీదుగా హర హర మహా యజ్ఞం ఆదివారం ఉదయం నుండి వేలాది మంది భక్తజనుల పాల్గొనగా రంగ రంగ వైభవంగా నిర్వహించారు. యానం పరిసర ప్రాంతాల ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో తులతూగాలని దృఢ సంకల్పంతో ఈ పవిత్ర కార్తీకమాసంలో యానం పెర్రి రోడ్లోలో ఈ హర హర మహా యజ్ఞం చేపట్టినట్లు కార్యక్రమం నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కొరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకి ప్రారంభమైన పూజా కార్యక్రమంతో హర హర మహా యజ్ఞం మృత్యుంజయ హోమం తదితర కార్యక్రమాలను వేద పండితుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న యానం పరిసర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులకు పూజ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం సాయంత్రం వరకు కొనసాగిన పూజలు అనంతరం శాంతి కళ్యాణం, జ్యోతిర్లింగార్చన, గౌతమి గోదావరికి పూర్ణ హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలు సందర్భంగా యానం మొత్తం శివనామస్మరణతో హర హర మహాదేవ శంభో అంటూ భక్తులు పెద్ద ఎత్తున వ్యవహార మహా యజ్ఞంలో పాల్గొన్నారు.

గైట్లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు

విశాలాంధ్ర - అమలాపురం : జనవరి 5,6,7,8,9 తేదీలలో రాజమహేంద్ర వరం గైట్లో ఆంధ్రాసారస్వత పరిషత్ చైతన్య. విద్యా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవివి సత్యనారాయణ రాజు(చైతన్యరాజు) తెలిపారు. ఆదివారం సాయంత్రం అమలాపురం కిమ్స్‌లో సన్నాహక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా చైతన్యరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహణకు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర మంత్రులు గవర్నర్‌లు, రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నారన్నారు. దీనికోసం ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృత ప్రచారం చేస్తున్నామని అందరు కవులు, మేధావులు తెలుగు భాషాభిమానులకు ఆహ్వానాలు పంపామని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజరాజ నరేంద్రుడు తెలుగు భాష రక్షణకు చేసిన కృషికి కేంద్రమైన రాజమహేంద్ర వరం కేంద్రంగా జరుగుతున్నా అంతర్జాతీయ తెలుగు మహాసభలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగు భాష మీద అభిమానం ఉన్న వారంతా తరలిరావలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి పివి రాఘవులు, మాజీ ఎమ్మెల్యేలు ఎం ఆయాజెవేమా, అయతాబత్తుల ఆనందరావు, పి జగ్గప్పరాజు, పి చిట్టిరాజు, సయ్యపరాజు సత్తిబాబు, దెందుకురి సత్తిబాబురాజు, పినిపే సత్యనారాయణ, ఎంఎన్‌వి ప్రసాద్, మోకా వెంకట సుబ్బారావు, సరేళ్ల విజయ ప్రసాద్, కిమ్స్ సిఎఓ కె రఘు వర్మ, డిబి లోక్, జంగా రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : సేవా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ అన్నారు. మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక దర్గాపేట బాధ్యత ట్రస్ట్ (మన ఇల్లు)లో వృద్ధులకు పళ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుంచే నానిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పలకొండ మాట్లాడుతూ సేవా కార్యక్రమం ద్వారా మంచి నడవడిక సాధ్యపడుతుందన్నారు. మానవ హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే మానవ హక్కుల సంఘం ద్వారా పోరాటం చేసి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని అప్పలకొండ అన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టా అప్పారావు, ఎస్ రహమాన్, జుత్తుక అప్పారావు, ఎండి పల్లీభాషా, ఎండి మున్వర్, భళ్లమూడి సూర్యనారాయణమూర్తి, లక్ష్మీ, ద్వారపూడి శ్రీను, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - కరప : నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. ఈ దుప్పట్లను కాకినాడ రమణయ్యపేటకు చెందిన అడబాల రత్నప్రసాద్ ఏర్పాటు చేసిన దుప్పట్లను పేదలకు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే వైసీపీ విజయానికి నాంది

విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్రెడ్డికి రానున్న ఎన్నికల్లో విజయానికి నాంది పలుకుతుందని ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఏడు పర్యాయాల పాటు నిర్వహించే పాదయాత్రలో భాగంగా ఐదవ రోజు ఆదివారం నిర్వహించిన పాదయాత్ర సామర్లకోట నుంచి పెద్దాపురం మండలం తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి సుమారు 15 మీటర్ల మేర పాదయాత్రను జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిలు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీరాఘవరావు, గృహ సారధుల మండల కన్వీనర్ గోపు మురళి, కౌన్సిలర్ దూది రాజు, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భగా ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, గ్రామ ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు ఆలయ వేద పండితులచే ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో కలిసి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయంలో జగన్మోహన్రెడ్డి మరింత సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సేవలో మరో 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

మురుగునీరు పోయేందుకు చర్యలు

విశాలాంధ్ర- తాళ్ళపూడి : తుఫాన్ కారణంగా ప్రక్కిలంక గ్రామం లో చేరిన మురుగు నీరు పోయేందుకు గాను తాళ్ళపూడి ప్రక్కిలంక గ్రామాల మధ్య తవ్విన ఆర్ అండ్ బి రోడ్డును ఎట్టకేలకు ఆదివారం సిమెంట్ తూరలతో పూడ్చి వేశారు. నియోజక వర్గ ఎస్సి సెల్ నాయకులు యాళ్ల బాబూరావు, ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు పలువురు వైకాపా నాయకులు తదితరులు పనులు పరిశీలించారు.

కాంద్రకోటలో కిరాణా దుకాణం దగ్ధం

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని కాంద్రకోటలో గత అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కిరాణా దుకాణం దగ్ధమై సుమారు రెండు లక్షల రూపాయల మేర ఆస్తినష్టం సంభవించినట్లు పెద్దాపురం అగ్నిమాపకాధికారి శ్రీహరి జగన్నాథం తెలిపారు. శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన పోబోలు సత్యకృష్ణకు చెందిన కిరాణా దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైందన్నారు. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయల మేర ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపకాధికారులు తెలిపారు.

కరాటే పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థుల ప్రతిభ



విశాలాంధ్ర - ఏలేశ్వరం : సామర్లకోట డిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విక్టరీ షూటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రెండోవ నేషనల్ కరాటే పోటీల్లో ఏలేశ్వరంకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కరాటే మాస్టార్ శిడగం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో స్పర్రింగ్ నందు దిమ్మల మధు కిరణ్ గోల్డ్ మెడల్, దినేష్ కార్తీక్ ఎల్లో మెడల్ సాధించారని అన్నారు. కట విభాగంలో గోల్డ్ సిల్వర్ మెడల్ సాధించారని అన్నారు. విజేతలకు గ్రాండ్ మాస్టర్ ఆర్ మల్లికార్జునరావు, సినీపరిశ్రమలో ఉన్న కరాటే మాస్టార్ లక్ష్మి చేతుల మీదుగా ఈ బహుమతులు అందజేశారన్నారు. విజేతలను పలువురు అభినందించారు.